

రేషన్ దుకాణాలు కిటకిట

● సన్న బియ్యం కోసం క్యూ కడుతున్న జనం



జ్యోతినగర్ రేషన్ షాపు వద్ద సన్న బియ్యం కోసం క్యూలో నిలుచున్న లబ్ధిదారులు

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డుదారులందరికీ సన్నబియ్యం పంపిణీ చేసే కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గత నెల వరకు దొడ్డు బియ్యం పంపిణీ చేసిన ప్రభుత్వం ఏప్రిల్ 1 నుంచి ఉచితంగానే సన్నబియ్యం పంపిణీ చేస్తుండడంతో రేషన్ దుకాణాల వద్ద బియ్యం తీసుకునేందుకు బారులు తీరుతున్నారు. మార్కెట్‌లో సన్న బియ్యం 55 నుంచి 60 రూపాయలు, అంతకంటే ఎక్కువ ధరకే విక్రయిస్తుండడంతో పేద ప్రజలకే కాకుండా మధ్యతరగతి, ఉన్నత వర్గాలకు చెందిన వారు రేషన్‌పై సన్నబియ్యం తీసుకునేందుకు పోటీపడుతున్నారు. సన్నబియ్యం పంపిణీ నిరంతర ప్రక్రియగా చేపడతామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించినప్పటికీ సన్నబియ్యం కోసం జనం ఎగబడుతున్నారు. గత బీఆర్‌ఎస్ పాలనలో కొన్ని దుకాణాల్లో కొద్దిరోజులపాటు సన్నబియ్యం పంపిణీ చేసి ఆ తర్వాత దొడ్డు బియ్యం పంపిణీ చేశారు. దీంతో ఇప్పుడు కూడా సన్నబియ్యం స్టాక్ అయిపోతే మళ్లీ సన్న బియ్యం ఇస్తారో లేదోనన్న అనుమానాలతో సన్నబియ్యం పంపిణీ చేస్తున్నందున ప్రజా పంపిణీ దుకాణాలు (రేషన్ షాపు) వద్ద క్యూ కట్టి సన్నబియ్యం తీసుకుంటున్నారు. ప్రతి నెల 16 నుంచి 21వ తేదీ వరకు జిల్లాలోనే కాకుండా దేశంలో ఎక్కడైనా ప్రజాపంపిణీ దుకాణాల నుంచి రేషన్ బియ్యం తీసుకునే అవకాశమున్నప్పటికీ ప్రజలు వారికి సమీపంలోని డీలర్ల వద్ద క్యూ కట్టి సన్నబియ్యం తీసుకుంటున్నారు. గతంలో రేషన్‌కార్డులపై ఉచితంగా దొడ్డుబియ్యం పంపిణీ చేయడంతో చాలా మంది ఆ బియ్యం తినలేక 10 నుంచి 12 రూపాయలకు అమ్ముకున్నారు. ఇప్పుడు మార్కెట్‌లో సన్నబియ్యం ధరలు మండిపోతుండడంతో ఉచితంగా వస్తున్న సన్నబియ్యం తీసుకునేందుకు ముందుకు వస్తున్నారు. చివరి వరకు సన్నబియ్యం ఇస్తారో లేక ఈ బియ్యం అయిపోయిన తర్వాత దొడ్డు బియ్యం పంపిణీ చేస్తారో తెలియక చాలా మంది రేషన్‌దుకాణాల వద్ద బారులు తీరుతున్నారు. సన్నబియ్యం కోసం గంటల తరబడి నిలబడాల్సివస్తోందని, బియ్యం నాణ్యంగానే ఉన్నాయని లబ్ధిదారులు అంటున్నారు.

30 వరకు 'ఎల్‌ఆర్‌ఎస్' గడువు పొడిగింపు

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్‌ఆర్‌ఎస్)ను ఏప్రిల్ 30వ తేదీ వరకు ప్రభుత్వం పొడిగించింది. 2020 సంవత్సరానికి ముందు రిజిస్ట్రేషన్ చేయించుకుని ఎల్‌ఆర్‌ఎస్ కోసం నామినల్ చార్జీలుగా వేయి రూపాయలు చెల్లించిన వారికి ఎల్‌ఆర్‌ఎస్ చార్జీల్లో 25 శాతం రాయితీ ఇచ్చిన ప్రభుత్వం మార్చి 31 వరకు చివరి గడువు విధించింది. సాంకేతిక సమస్యలు, మార్చి 30, 31 తేదీల్లో ఉగాది, రంజాన్ పండుగలు రావడం, వివిధ కారణాలతో గడువు పొడిగించాలంటూ ప్రజలు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. అందరూ ఊహించినట్లుగానే రాష్ట్ర మున్సిపల్‌శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ దాన కిశోర్ జీవో ఆర్‌టీ నంబర్ 182 ద్వారా ఏప్రిల్ 30 తేదీ వరకు ఎల్‌ఆర్‌ఎస్ గడువును పొడిగించారు. గడువులోగా చెల్లించిన వారికి 25 శాతం రాయితీ వర్తిస్తుందని జీవోలో పేర్కొన్నారు. మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో కూడా ఎల్‌ఆర్‌ఎస్ గడువును పొడిగించిన సర్కారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించింది. ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ చార్జీలపై 25 శాతం రాయితీ సదుపాయం పొందేందుకు ఇదే చివరి అవకాశమని, అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

ప్రతీ రిబ్బన్‌కు ఓ ప్రత్యేకత

● ఒక్కో సందర్భానికి ఒక్కో రంగు

7

'ఆసరా'కు నిరీక్షణ

● మూడేళ్లుగా కొత్త పెన్షన్ల మంజూరు లేదు
● వేల సంఖ్యలో దరఖాస్తుల పెండింగ్



కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఆసరా పెన్షన్ల కోసం అర్హులైన లబ్ధిదారులు కళ్లలో వత్తులు వేసుకుని నిరీక్షిస్తున్నారు. 2022 జూలై నుంచి ఆసరా పెన్షన్ల సైట్ ఓపెన్ చేయక పోవడంతో అర్హులైన అనేక మంది మున్సిపా లిటీలు, తహసీల్దార్ కార్యాలయాలు, గ్రామపంచాయతీల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. గత ప్రభుత్వం 57 ఏళ్ల వయసుపై వారికి పెన్షన్లు మంజూరు చేస్తామని ప్రకటించడంతో చాలా మంది పెన్షన్లపై ఆశలు పెట్టుకున్నారు. అర్హులైన అనేక మంది దరఖాస్తు చేసుకున్నారు. వాటిని అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి లబ్ధిదారులను ఎంపిక చేశారు. సంబధిత వెబ్‌సైట్ ఓపెన్ కాకపోవడంతో వారందరికి పెన్షన్ అందలేదు.

● పెరగని పెన్షన్లు

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇచ్చిన ఆసరా పెన్షన్లను పెంచి చేయూత పథకాన్ని అమల్లోకి తెస్తామని ప్రకటించింది. అర్హులైన వారందరికీ కొత్త పెన్షన్లను మంజూరు చేస్తామని హామీ ఇచ్చింది. 2023 డిసెంబరులో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు పెన్షన్ల విషయాన్ని ఊసెత్తలేదు. గత ఏడాది, ఈ యేడాది బడ్జెట్‌లో పెన్షన్లకు సంబంధించిన బడ్జెట్ కేటాయింపులు పెంచలేదు. దీంతో పెన్షనర్ల ఆశలు అడియాశలయ్యాయి. మూడేళ్లుగా కొత్తగా పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారితోపాటు ప్రస్తుతం ఆసరా పథకం ద్వారా పించన్లు పొందుతున్న వారు కూడా పెన్షన్ల మొత్తాన్ని పెంచక పోవడంతో తీవ్ర నిరాశకు లోనవుతున్నారు. కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని దాదాపు 6వేల మంది ఆసరా పెన్షన్లకు అర్హులుగా పేర్కొంటూ లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తి చేసినా పింఛన్ మంజూరు చేయలేదు. దీనితో వారంతా మున్సిపల్ కార్యాలయం చుట్టూ, అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నారు. ఇప్పటికే పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో చాలా మంది చనిపోగా, ప్రస్తుతం ఆసరా పించన్లు పొందుతున్న వారిలో కూడా కొంత మంది వారి ఆశలు నెరవేరకుండానే కళ్లు మూశారు. 2022 జూలై నుంచి ఆసరా పెన్షన్లు పొందుతున్న లబ్ధిదారుడు మృతిచెందితే వారి కుటుంబసభ్యుల్లో ఒకరికి పింఛన్ మంజూరు చేస్తున్నారు. పెన్షన్ల మొత్తాన్ని పెంచుతామని ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే తమకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు. అర్హులైన వారందరికి కొత్త పించన్లు మంజూరు చేయాలని దరఖాస్తుదారులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

స్కానింగ్ సెంటర్ల తనిఖీ

సుభాష్‌నగర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ ప్రత్యేక బృందంతో కలిసి స్కానింగ్ సెంటర్లను బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్కానింగ్ సెంటర్‌కు వచ్చిన ఔట్ పేషంట్స్ వివరాల రిజిస్టర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ స్కానింగ్ సెంటర్ల తనిఖీలు నిరంతరం కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో పీసీపీఎన్ డీటీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ సనాజవేరియా, టూటౌన్ సీఐ సృజన్‌రెడ్డి, ఏఎస్ఐ విజయమణి, డెమో రాజగోపాల్, డీఈవో రమేశ్, సూపర్‌వైజర్ సయ్యద్‌సాబీర్ పాల్గొన్నారు.



స్కానింగ్ సెంటర్‌లో రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ

హెచ్‌సీయూ భూములను పరిరక్షించాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి
● పోలీసుల నిర్బంధాన్ని ఖండిస్తూ నిరసన



చేతికి సంకెళ్లతో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

గణేశ్‌నగర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): హెచ్‌సీయూ భూములను పరిరక్షించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో శాంతియుతంగా ఆందోళన చేస్తు న్న సీపీఎం నాయకులను అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ ఆ పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ చౌక్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజాపాలన సాగడం లేదని అన్నారు. హెచ్‌సీయూ భూముల్లోని అటవీ ప్రాంతాన్ని రాత్రికి రాత్రే తగలబెటడం శోచనీయమన్నారు. శాంతియుతంగా చేస్తున్న ప్రజా ఉద్యమా లను అణిచి వేస్తూ, నాయకులను నిర్బంధించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని, యూనివర్సిటీ భూములను పరిరక్షించేందుకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గీట్ల ముకుంద రెడ్డి, గుడికందుల సత్యం, బీమాసాహెబ్, జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాస్, సుంకర సంపత్, నరేష్ పటేల్, రాజేశం, నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన 'పది' పరీక్షలు

● చివరి రోజు 17 మంది గైర్హాజరు
● ఉత్సాహంగా ఇళ్లకు వెళ్లిన విద్యార్థులు

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 2: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి చివరి రోజు బుధవారం నిర్వహించిన సాంఘిక శాస్త్రం పరీక్షకు 17 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 12,521 మంది రెగ్యులర్‌గా పరీక్షలు రాయాల్సి ఉండగా 17 మంది గైర్హాజరు కాగా 12,504 మంది పరీక్ష రాశారు. తొమ్మిది మంది ప్రైవేట్ విద్యార్థుల్లో ఐదు మంది పరీక్షలు రాయగా నలుగురు గైర్హాజరయ్యారు. జిల్లాలోని 20 పరీక్షా కేంద్రాలను ప్రత్యేక అధికారుల బృందం, పరీక్షా విభాగం సహాయ కమిషనర్ ఐదు కేంద్రాలను, జిల్లా విద్యాశాఖ అధికారి సిహెచ్‌విఎస్ జనార్దన్‌రావు ఐదు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ జిల్లాలో పకడ్బందీ ఏర్పాట్ల మధ్య పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా రెవెన్యూ, విద్యుత్, ఆర్టీసీ, వైద్యశాఖల అధికారుల సహకారంతో పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేశామని, దీంతో ఎక్కడ కూడా విద్యార్థులకు అసౌకర్యం కలగలేదని అన్నారు. పరీక్షలు ప్రశాంతంగా ముగియడంతో విద్యార్థులు ఉత్సాహంగా కేరింతలు కొడుతూ సహ విద్యార్థులకు వీడ్కోలు చెప్పి స్వగ్రామాలకు బయలుదేరారు. దీంతో ఆర్టీసీ బస్టాండ్ విద్యార్థులు, వారి కుటుంబసభ్యులతో కిటకిటలాడింది. ఈసారి ఎండల తీవ్రత అధికంగా ఉండడంతో ఎండదెబ్బ తగులకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఉన్నత చదవులకు ఉజ్వల బాటలు వేసుకోవాలని ఉపాధ్యాయులు విద్యార్థులకు సూచించారు.



పరీక్ష కేంద్రం వద్ద విజయ సంకేతం చూపుతున్న విద్యార్థినులు



విద్యార్థులు, ప్రయాణికులతో కిక్కిరిసిన కరీంనగర్ బస్టాండ్

ఎండుతున్న పంటలు

● ఆందోళనలో అన్నదాతలు



గుమ్లాపూర్‌లో ఎండిపోయిన వరి

చొప్పదండి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మెట్ట ప్రాంతాలైన గుమ్లాపూర్, సాంబయ్యపల్లి, కాట్నపల్లి గ్రామాల్లో వరి, మొక్కజొన్న పంటలు ఎండిపోతున్నాయి. కాకతీయ కాలువకు ఎగువ భాగంలో ఉన్న ఈ గ్రామాల రైతులు బావులు, చెరువులపై ఆధారపడి సాగు చేస్తారు. ఎండలు ముదరడంతో చెరువుల్లో ఎండిపోయాయి. దీంతో భూగర్భ జలాలు అడుగంటాయి. బావులు, బోర్ల కింద సాగు చేసిన వరి, మొక్కజొన్న పంటలు నీరు లేక ఎండిపోతున్నాయి. వందకుపైగా ఎకరాల్లో పంటలు ఎండిపోయాయి. వరద కాలువకు తూములు ఏర్పాటు చేస్తేనే తమ గ్రామాలకు సాగునీరందుతుందని, ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ విషయంపై దృష్టి పెట్టాలని రైతులు కోరుతున్నారు.

సర్వాయి పాపన్న పోరాటం స్ఫూర్తిదాయకం

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం, భూస్వామ్య వ్యవస్థకు వ్యతి రేకంగా పోరాడిన యోధుడని, ఆయన పోరాటాలు భవితరాలకు స్ఫూర్తిదాయకమని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కలెక్టర్ హాజరై సర్వాయి పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సామాజిక సమానత్వానికి పాటుపడిన మహనీయుడు సర్వాయి పాపన్న అని కొనియాడారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్, బీసీ సంక్షేమ అధికారి అనిల్ ప్రకాశ్, గౌడ సంఘం, బీసీ సంఘాల ప్రతినిధులు తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, గుగ్గిళ్ల శ్రీనివాస్, మాచెర్ల అంజయ్య, జక్కె వీరస్వామి పాల్గొన్నారు.



సర్దార్ సర్వాయి పాపన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్

రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర ప్రారంభం



కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో పాదయాత్ర చేస్తున్న కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర బుధవారం కరీంనగర్‌లో ప్రారంభమైంది. కోతిరాంపూర్‌లోని గాంధీ విగ్రహం నుంచి సుడా ఛైర్మన్, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి ప్రాదయాత్ర ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి మాట్లాడు తూ రాజ్యాంగాన్ని మార్చాలని కుట్రలు పన్నుతున్న వారికి వ్యతిరేకంగా ఈ యాత్ర నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్లు పడిశెట్టి భూమయ్య, ఉమాపతి,నేతికుంట యాదయ్య, మల్లికార్జున రాజేందర్, సరిల్ల ప్రసాద్, చాడగొండ బుచ్చిరెడ్డి, గంట కళ్యాణి శ్రీనివాస్, కోడూరి రవీం దర్ గౌడ్, చెర్ల పద్మ, ఎస్సీసెల్ అధ్యక్షుడు కొరివి అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించాలి

● కలెక్టర్ పమేలా సత్పతి

ఇల్లందకుంట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట సీతారామ చంద్రస్వామి ఆలయంలో ఈ నెల 4 నుంచి జరిగే శ్రీరామనవమి బ్రహ్మోత్స వాలు ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. బుధవారం ఇల్లందకుంట మండల కేంద్రంలో హుజూరాబాద్ డివిజన్ పరిధిలోని ఉన్నతాధికారులతో తహసీ ల్దార్ కార్యాలయంలో కలెక్టర్ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా అన్ని సౌకర్యాలు, సదుపాయాలు సమకూర్చాలన్నారు. భక్తులకు కనపడే విధంగా ఎల్‌ఈడీ స్ర్కీన్‌లను ఏర్పాటు చేయాలన్నారు. తాగునీటి సౌకర్యం, శానిటేషన్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయాలన్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పార్కింగ్ ఏర్పాట్లు చూడాలని సూచించారు. హుజూ రాబాద్, జమ్మికుంట నుంచి వచ్చే భక్తులకు బస్సు సౌకర్యం కల్పించాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. జమ్మికుంట రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలను అధికారులు సమన్వయంతో పనిచేసి విజయ వంతం చేయాలన్నారు. మంత్రులు ఎవరు వచ్చిన తాను వారితో కలిసి పాల్గొంటానని తెలిపారు. బీఆర్‌ఎస్ హయాంలో శ్రీరామ నవమి కోసం కలెక్టర్ అకౌంట్ నుంచి 10 లక్షలు కేటాయించేవారని, ఈసారి అలాగే నిధులు మంజూరు చేయాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సీపీ గౌస్ ఆలం, అడిషనల్ కలెక్టర్ లక్ష్మికిరణ్, హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీ, హుజూరాబాద్ ఆర్డీవో రమేష్‌బాబు, ఆలయ ఈవో కందుల సుధాకర్, తహసీల్దార్ రాణి, ఎంపీడీవో పుల్లయ్య పాల్గొన్నారు.



ఇల్లందకుంటలో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య


మధు (ఫైల్)

ఇల్లందకుంట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిరిసేడు గ్రామానికి చెందిన వంగ మధు(28) అనే కౌలు రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మధు చిన్న వయస్సులోనే తల్లి చనిపోగా, తండ్రి ఐదేళ్ల క్రితం మృతిచెందాడు. మధు గ్రామంలో మూడెకరాల భూమిని కౌలుకు తీసుకొని మొక్కజొన్న పంటను సాగుచేశాడు. ఈ క్రమంలో మొక్కజొన్న లాభసాటిగా దిగు బడి రాకపోగా, సుమారు రూ. 1.50లక్షల వరకు నష్టం వచ్చింది. దీంతో మనస్థాపం చెందిన మధు ఆదివారం ఇల్లందకుంట శివారులోని ఎర్ర గుట్టల సమీపంలో పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు వెంటనే జమ్మికుంటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించగా, చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతిచెందాడు.

బావిలో పడి రైతు మృతి


దేవయ్య (ఫైల్)

గంభీరావుపేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట మండలం ముస్తాఫనగర్ గ్రామంలో బుధవారం ప్రమాదవశాత్తు బావిలో పడి రైతు మృతిచెందాడు. చివరి దశలో ఎండుతున్న పంటను కాపాడుకోవటానికి ఓ రైతు తన బావిలో పూడికతీత పనులు మొదలు పెట్టాడు. పనులను చూసేందుకు తాడు సహాయంతో బావిలోకి దిగుతుండగా రైతు ప్రమాదవశాత్తు జారిపడటంతో మృతిచెందాడు.ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. శివంది దేవయ్య (45) తనకున్న 3 ఎకరాల పొలంలో వరి పంట వేశాడు. తన వ్యవసాయ బావిలో నీరు ఇంకిపోతుండటంతో మూడు రోజుల క్రితం క్రేన్‌తో పూడికతీత పనులు మొదలు పెట్టాడు. తాడు సహాయంతో రైతు దేవయ్య బుధవారం బావిలోకి దిగుతున్న క్రమంలో జారిపడ్డాడు. తీవ్రగాయాల పాలైన దేవయ్యను ఎల్లారెడ్డిపేటలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కొద్దిసేపటికే రైతు దేవయ్య మృతిచెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి


సరోజన(ఫైల్)

చందుర్తి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న చందుర్తి మండలకేంద్రానికి చెందిన చింతపల్లి సరోజన(78)అనే వృద్ధురాలు బుధవారం మృతిచెందింది. పోలీసులు, గ్రామస్థుల కథనం ప్రకారం.. సరోజన గత మార్చి 31న తన కుమారుడైన వెంకటేశ్వర్‌రావుతో ద్విచక్రవాహనంపై చందుర్తి నుంచి వేములవాడకు వెళ్తుండగా మండలకేంద్రం శివారులో కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో సరోజన తలకు బలమైన దెబ్బ తగలడంతో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు పేర్కొన్నారు. ఈ సంఘటనపై మృతురాలి బంధువు కారంగుల మధుసూదన్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అంజయ్య తెలిపారు. మృతిరాలికి ఒక కుమారుడు, కూతురు ఉన్నారు.

కారు ఢీకొని వృద్ధుడి మృతి

ధర్మపురి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలం నేరెళ్ల గ్రామ సమీపంలో కారు ఢీకొని అదే గ్రామానికి చెందిన లెక్కల లింగన్న (65) అనే వృద్ధుడు బుధవారం మృతిచెందాడు. లింగన్న నేరెళ్ల వద్ద బీటు వద్ద పనులు ముగించుకొని నడుచుకుంటూ ఇంటికి వస్తుండగా జగిత్యాల వైపు నుంచి ధర్మపురి వెళ్తున్న కారు టీఎస్ 10ఈఈ 8668 డ్రైవర్ అతివేగంగా వచ్చి ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కారు నడిపినవ్యక్తి హైదరాబాద్ అల్వాల్‌కు చెందిన రాపర్తి వెంకటేష్‌గా గుర్తించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఉదయ్‌కుమార్ తెలిపారు.

బాధ్యతలు స్వీకరించిన ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఈడీ


ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఈడీగా బాధ్యతలు స్వీకరిస్తున్న పగిడిమర్రి సోలోమన్

భగత్‌నగర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ఆర్టీసీజోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పగిడిమర్రి సోలోమన్ బుధవారం బస్టాండ్‌లోని కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రీజినల్ మేనేజర్ బి.రాజు, డిప్యూటీ రీజినల్ మేనేజర్లు బీవీ రావు, భూపతిరెడ్డి, డిప్యూటీ పర్సనల్‌మేనేజర్ విలాస్‌రెడ్డి, జోనల్ పర్సనల్ మేనేజర్ విలాస్ రెడ్డి, సుగుణాకర్, సీనియర్ మెడికల్‌ఆఫీసర్ గిరిసింహారావు శుభకాంక్షలు తెలిపారు.

● కరీంనగర్ జోన్ ఈడీగా పనిచేసి హైదరాబాద్ బదిలీపై వెళ్తున్న ఖుస్రోషాఖాన్‌కు నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఈడీ సోలోమన్‌కు టీజీఎస్‌ఆర్టీసీ ఎస్సీఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుభాకాంక్షలు తెలిపారు.

పొద్దు తిరుగుడు కొనేదెన్నడు?


ముస్తానిపేట గ్రామంలో కల్లాల వద్ద ఆరబోసిన పొద్దుతిరుగుడు గింజలు

● కొనుగోలు కేంద్రాలు లేక రైతుల ఇబ్బందులు
● దళారీల బారినపడి నష్టపోతున్న వైనం

ఇల్లంతకుంట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో పొద్దుతిరుగుడు రైతులు దళారీల బారినపడి తీవ్రంగా నష్టపోతున్నారు. మండలంలోని ముస్కానిపేట, కేసన్నపల్లె, గాలిపెల్లి, తాళ్లపెల్లి, పత్తికుంటపల్లె తదితర గ్రామాల్లో దాదాపు 1200 ఎకరాలలో రైతులు పొద్దుతిరుగుడు పంటను ఈ సంవత్సరం సాగుచేశారు. విత్తనాల ధరకు తోడు కూలీల ధరలు పెరగడంతో గతంలో కంటే పొద్దుతిరుగుడు సాగుచేయడానికి పెద్దమొత్తంలో రైతులు వెచ్చించారు. పంటచేతికి అందివచ్చే దశలో బావులు, బోర్లలో నీరు తగ్గడంతో నానా ఇబ్బందులు పడి పంటను కాపాడుకున్నారు. పొద్దుతిరుగుడు పంటను కోసి నెల రోజులు కావస్తోంది. పొదుతిరుగుడు పంటను అమ్ముకుందామంటే కొనుగోలు కేంద్రం లేదు. సిద్దిపేట, బెజ్జంకిలో మాత్రమే ఉండడంతో అక్కడికి అమ్ముదామనుకుంటే ఈప్రాంత రైతుల పంటను కొనుగోలు చేయడం లేదు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా క్వింటాలుకు రూ.7280 చెల్లిస్తుండగా దళారులు రూ.5500కు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. సిద్దిపేట జిల్లాకు చెందిన కొంతమంది దళారులు ఇక్కడ రైతుల వద్ద నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. కష్టపడి పండించిన పంటను కొంతమంది రైతులు తక్కువ ధరకు అమ్మలేక, వ్యవసాయ బావుల వద్ద కల్లాల్లోనే ఉంచుకుంటున్నారు. వర్షాలు పడితే ఎక్కడ పంట తడుస్తుందో అని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం స్పందించి పొద్దుతిరుగుడు పంట కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

రైతులకు తీవ్ర నష్టం జరుగుతోంది..

బట్టు సుధాకర్, రైతు గాలిపెల్లి



పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రం లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. దళారులు తక్కువ ధరకు కొనుగోలు చేసి లాభాలు ఆర్జిస్తున్నారు. భూగర్భజలాలు తగ్గడంతో కొంతమేర ఎండిపోయింది. సిద్దిపేట, బెజ్జంకి కొనుగోలు కేంద్రాలకు తీసుకొని పోయినా పట్టాదారు పాసుపుస్తకాలు చూసి తమ ప్రాంతానివి కావని తిప్పి పంపుతున్నారు. ఆరు ఎకరాలలో పంటను సాగుచేశాను. పంటను కోసి నెల రోజులు అవుతోంది. ప్రభుత్వం వెం టనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలి.

త్వరలో సమస్య పరిష్కారం..

సురేష్‌రెడ్డి, ఇల్లంతకుంట వ్యవసాయాధికారి



పొద్దుతిరుగుడు రైతుల సమస్య త్వరలోనే పరిష్కారం అవుతుంది. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని జిల్లా అధికారుల దృష్టికి తీసుకపోయాం. ఉన్నత స్థాయి అధికారుల ఆదేశాల కోసం ఎదురుచూస్తున్నాం. కొనుగోలు కేంద్రం ఏర్పాటు కాకపోతే టోకెన్లు జారీచేస్తాం. రైతులు తొందరపడి దళారులకు అమ్మి నష్టపోవద్దు. పంటను కల్లాల వద్ద జాగ్రత్తగా కాపాడాలి.



గీత కార్మికుడికి తీవ్రగాయాలు


గాయపడ్డ తిరుపతి

ధర్మారం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామయ్యపల్లి గ్రామానికి చెందిన గీత కార్మికుడు తాటిచెట్టు పైనుంచి పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. గ్రామానికి చెందిన పల్లె తిరుపతి వృత్తిరీత్యా బుధవారం సాయంత్రం తాటి చెట్టు ఎక్కుతుండగా మోకు జారి కింద పడి తీవ్ర గాయాల పాలయ్యాడు. తిరుపతి పరిస్థితి విషమించడంతో అతన్ని స్థానికులు పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

అజాగ్రత్తగా బైక్ నడిపిన బాలుడిపై కేసు

చందుర్తి, ఏప్రిల్ 2, (ఆంధ్ర జ్యోతి): అజాగ్రత్తగా ద్విచక్ర వాహనం నడిపి ఆటోను ఢీకొట్టిన సంఘటనలో బాలుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అంజయ్య బుధవారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. మండలంలోని బండపల్లి గ్రామానికి చెందిన మల్యాల జాషువా(17) అనేబాలుడు ద్విచక్ర వాహనంపై బండపల్లి నుంచి వేములవాడ వైపు వెళుతుండగా, వేములవాడ నుంచి బావుసాయిపేట వైపు వస్తున్న ఆటోను ద్విచక్రవాహనదారుడు ఢీకొట్టాడు. ఈ సంఘటనలో కోనరావుపేట మండలం బావుసాయిపేట గ్రామానికి జంగం జాన్‌కు గాయాలయ్యాయి. జంగం ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జాషువాపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఫ్లెక్సీల ధ్వంసంపై కేసు

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా కాంగ్రెస్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను గుర్తుతెలియని వ్యక్తులు చించివేయడం, దహనం చేయడంపై యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు కిమ్ ఫాహద్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు. బుధవారం యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు, జిల్లా ఇన్‌చార్జి అబ్దుల్ అమీర్ డీసీసీ కార్యాలయంలో సమీక్షా సమావేశానికి హాజరయ్యారు. ఈ క్రమంలో జిల్లా నాయకులు ఫ్లెక్సీలను ఏర్పాటుచేశారు. గుర్తుతెలియని వ్యక్తులు యువజన కాంగ్రెస్ నాయకుడు ఫాహద్ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని చించి వేశారు. జిల్లా ప్రధానకార్యదర్శి అజీం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని తగలబెట్టారు. కొందరు కాంగ్రెస్ నాయకులే తమ ఫ్లెక్సీలను ధ్వంసం చేసినట్లు అనుమానంగా ఉందని ఫాహద్ ఫిర్యాదులో పేర్కొన్నారు.

మోటార్ సైకిల్‌ను ఢీకొన్న రెండు కార్లు

● ఇద్దరికి తీవ్రగాయాలు


రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ విఠల్, అవినాష్

మానకొండూర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోచంపల్లి గ్రామశివారులో మోటార్‌సైకిల్‌ను రెండుకార్లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కెల్లేడు గ్రామానికి చెందిన విఠల్ (18), అవినాష్ (18) అనే ఇంటర్ విద్యార్థులు మోటార్ సైకిల్‌లో పెట్రోల్ పోసుకునేందుకు బంక్‌కు వచ్చి తిరిగివెల్లుతున్నారు. జమ్మికుంట నుంచి కరీంనగర్ వైపు వెల్లుతున్న కారు మోటార్ సైకిల్‌ను ఢీకొంది. అదే సమయంలో కరీంనగర్ నుంచి పచ్చునూర్ వైపు వెల్లుతున్న మరో కారు అదే మోటార్ సైకిల్ ఢీకొంది. ఈ ప్రమాదంలో మోటార్‌సైకిల్‌పై ఉన్న ఇద్దరికి తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

పందుల చోరీ

సుల్తానాబాద్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని రైస్ మిల్లులప్రాంతంలో కొందరు గుర్తు తెలియని దొంగలు మందలో ఉన్న పందులను ఎత్తుకెళ్లారు. మానుపాటి ఈదయ్యకు చెందిన 32 పందులను ఒక చోట మందగా ఏర్పాటుచేసి అందులో ఉంచగా బుధవారం ఉదయంలేచి చూసేసరికి మందలో పందులు మాయంఅయ్యాయి. దాంతో బాధితులు వెంటనేపోలీసులను ఆశ్రయించారు. సమీపంలోని రైస్‌మిల్లు అసోషి యోషన్ కార్యాలయంలోఉన్న సీసీ కెమెరాల ఫుటేజీ పరిశీలించగా ముగ్గురు వ్యక్తులు ఒకబైక్‌పై ముందు వెళ్తుండగా మరోట్రాలీలో పందులను తీసుకువెళ్తున్నట్లు కనిపించింది. దాదాపు 2లక్షల రూపాయల విలువ ఉంటాయని బాధితులు తెలిపారు.

అనుమతి లేకుండా రోడ్డుపై వార్షికోత్సవం

● పాఠశాలపై కేసు నమోదు

ముస్తాబాద్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీవాణి ప్రైవేట్ పాఠశాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గణేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాఠశాల వార్షికోత్సవం మంగళవారం సాయంత్రం ఎలాంటి అనుమతి లేకుండా రోడ్డుపై నిర్వహించడంతో వాహనదారులకు ఇబ్బందులు కలిగించారని పాఠశాల యాజమాన్యంతోపాటు, ఆర్గనైజర్‌పై కూడా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వెలిచాల గ్రామాన్ని సందర్శించిన కేంద్ర బృందం


వెలిచాల గ్రామ పంచాయతీ ఆవరణలో కేంద్ర బృందం

రామడుగు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలిచాల గ్రామాన్ని కేంద్ర తాగునీరు, పారిశుధ్య ప్రతినిధుల బృందం బుధవారం సందర్శించింది. స్వచ్ఛభారత్ మిషన్ ఓడీఎఫ్ ప్లస్ మోడల్ గ్రామంగా ప్రకటించుకొని గ్రామంలోని పారిశుధ్య వసతులను, వ్యక్తిగత మరుగుదొడ్ల వాడకం, తడి చెత్త, పొడి చెత్త నిర్వహణ, మురికినీటి నిర్వహణ, డ్రైనేజీ గుంత వాడకం, తదితర అంశాల సుస్థిరతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కేంద్ర బృందంలో డిప్యూటీ సెక్రెటరీ శ్రీనివాస్, కన్సల్టెంట్ జైపాల్ దక్ష, స్వచ్ఛ భారత్ మిషన్ రాష్ట్ర డైరెక్టర్ సురేష్ బాబు ఉన్నారు. కార్యక్రమంలో డీఆర్డీవో శ్రీధర్, మండల ప్రత్యేక అధికారి అనిల్ ప్రకాశ్ కిరణ్, ఎంపీడీవో రాజేశ్వరి, పంచాయతీ అధికారి శ్రవణ్, గ్రామప్రత్యేక అధికారి, ఏపీవో రాధ, ఏపీఎం ప్రభాకర్, జిల్లా స్వచ్ఛ భారత్ మిషన్ కన్సల్టెంట్లు రమేష్, వేణు, యూనిసెఫ్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ కిషన్ స్వామి, తదితరులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి పట్టణంలో చోరీ

● 13 తులాల బంగారం, 20 తులాల వెండి అపహరణ

మెట్‌పల్లిటౌన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లిపట్టణంలోని సాయిరాంనగర్ కాలనీలో బుధవారం దొంగలు ఓ ఇంటి తాళం పగులగొట్టి 13 తులాల బంగారం, 20తులాల వెండి ఎత్తుకెళ్లారు. మెట్‌పల్లి ఎస్ఐ కిరణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం సాయిరాంనగర్ కాలనీకి చెందిన ఎల్దాస్ శ్యామల అనే ఉద్యోగి తన బంధువుల దగ్గరికివెళ్లి తిరిగి బుధవారం సాయంత్రం ఇంటికి రాగా ఇంటి తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న 13 తులాల బంగారం, 20తులాల వెండి చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించింది. సంఘటన స్థలాన్ని మెట్‌పల్లి డీఎస్పీ రాములు, సీఐ అనిల్ కుమార్‌లు పరిశీలించి క్లూస్ టీంతో వివరాలు సేకరించారు. బాధితురాలి ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ఖననం చేసిన చిన్నారి మృతదేహం వెలికితీత

● మేజిస్ట్రేట్ సమక్షంలో పోస్టుమార్టం

వేములవాడ రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : పసికందు మృతికి రెండు ప్రైవేటు హాస్పిటల్స్ కారణమని తల్లిదండ్రుల ఫిర్యాదు చేయడంతో ఖననం చేసిన మృతదేహాన్ని పోలీసులు బుధవారం వెలికితీశారు. వివరాల్లోకి వెళితే.. ఫాజుల్‌నగర్ గ్రామానికి చెందిన గండి గీతాంజలికి గతనెల 18వ తేదీన కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో మగబిడ్డ జన్మించాడు. పుట్టిన తర్వాత శిశువు ఆరోగ్యం నిలకడగా లేకపోవడంతో కరీంనగర్‌లోని మరో ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అయినప్పటికి పరిస్థితిలో మార్పు రాకపోవడంతో హైదరాబాద్‌కు తరలించారు. తరలించిన గంటల వ్యవధిలో పసికందు మృతిచెందాడు. మృతదేహాన్ని ఫాజుల్‌నగర్ గ్రామంలో పూడ్చారు. అయితే తమ కొడుకు మృతికి కరీంనగర్‌లోని రెండు ప్రైవేటు ఆసుపత్రులే కారణమని రాజశేఖర్-గీతాంజలి దంపతులు కరీంనగర్ రెండో పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు బుధవారం ఎస్సైలు దీపక్, చంద్రశేఖర్‌లు చిన్నారిని పూడ్చిపెట్టిన ఫాజుల్‌నగర్ గ్రామానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. ఖననం చేసిన చిన్నారి మృతదేహాన్ని మండల మెజిస్ట్రేట్ అబుబాకర్ సమక్షంలో వెలికితీసి ఏరియా ఆసుపత్రి వైద్యులు ప్రణతిరెడ్డి ఆధ్వర్యంలో పోస్టుమార్టం నిర్వహించారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

కారు ఢీకొని ముగ్గురు విద్యార్థులకు గాయాలు

ధర్మపురి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో బుధవానం కారు ఢీకొని కుర్మదాస్, వినయ్, ప్రేమ్‌దాస్ అనే ముగ్గురు విద్యార్థులు గాయపడ్డారు. గునిశెట్టి సంతోష్ అనే వ్యక్తి జూనియర్ కళాశాల మైదానంలో సాయంత్రం కారు నేర్చుకుంటున్నాడు. అదే సమయంలో జ్యోతిబాఫూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ పురుషుల డిగ్రీకళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు వాకింగ్ చేస్తున్నారు. సంతోష్ నడుపుతున్న కారు అదుపు తప్పి ముగ్గురు విద్యార్థులను ఢీకొట్టడంతో ఆసిఫాబాద్‌కు చెందిన కుర్మదాస్ అనే విద్యార్థికి రెండు కాళ్లు ఫ్రాక్చర్ అయ్యాయి. మరో ఇద్దరు విద్యార్థులకు స్వల్పంగా గాయాలయ్యాయి. గాయపడిన విద్యార్థులను వెంటనే చికిత్స కోసం జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. వైస్‌ప్రిన్సిపాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఉదయ్‌కుమార్ తెలిపారు.

కిష్టంపల్లిలో ప్రభుత్వభూమి కబ్జాకు యత్నం

● కాపాడేందుకు విగ్రహాల ప్రతిష్ఠ


కిష్టంపల్లిలో ఏర్పాటు చేసిన విగ్రహాలు

రామడుగు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రామడుగు మండలంలోని వెంకట్రావుపల్లె పరిధిలోని కిష్టంపల్లిలో ఓవ్యక్తి ప్రభుత్వభూమి కబ్జా చేసేందుకు యత్నించగా గ్రామస్థులందరు కలిసి దేవతా మూర్తుల విగ్రహాలను ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. గ్రామస్తులకథనం ప్రకారం.. గ్రామం లోని 674సర్వే నంబర్‌లో తొమ్మిది ఎకరాల ప్రభుత్వ భూమిఉంది. ఈభూమిని లక్ష్మీ పూర్ పంపుహౌజ్ నిర్మాణం జరిగిన సమ యంలో మెగా కంపెనీ ఈ భూమిలో మట్టిని పోసేందుకు ప్రభుత్వం నుంచి అనుమతి పొందింది. అయితే ఈ భూమి తనకు సంబంధించినదని ఓవ్యక్తి చదును చేస్తున్న సమయంలో గ్రామస్థులు ఆయనను అడ్డుకున్నారు. ఈ ఘటనలో స్థానిక సదరువ్యక్తి ఫిర్యాదు చేయడంతో 42మందిపై కేసులు నమోదయ్యాయి. ఈ ఘటన ఇలా ఉండగా నాలుగురోజుల క్రితం మళ్లీ భూమిని కైవసం చేసుకోవడానికి ప్రయత్నించడంతో గ్రామస్థులంతా కలిసి అదే స్థలంలో శివలింగం నంది విగ్రహాలను నెలకొల్పారు. దీంతోగ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొనడంతో సమస్య పోలీస్‌స్టేషన్‌కు వెళ్లింది.

దీంతో రూరల్ ఏసీపీ కరుణాకర్ గ్రామానికి వచ్చి పరిశీలించి విచారణ చేపట్టినట్లు తెలిసింది. కాగా భూమి సదరు వ్యక్తికి సంబంధించిందాలేదా ప్రభుత్వానిదా అనేది తేలాల్సి ఉంది.

హత్య కేసులో నిందితుల రిమాండ్

● పది నెలల తర్వాత గుర్తింపు


మాట్లాడుతున్న డీఎస్పీ రఘుచందర్

జగిత్యాల క్రైం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పదినెలల క్రితం బీర్‌పూర్ శివారులోని రోళ్లవాగు వద్ద జరిగిన అంకం లక్ష్మీనారాయణ(55) అనే వ్యక్తి హత్యకేసులో నిందితులను బుధవారం గుర్తించి పోలీసులు రిమాండ్‌కు తరలించారు. కేసు వివరాలను జగిత్యాలలో బుధవారం డీఎస్పీ రఘుచందర్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాలప్రకారం జూన్ 14న బీర్‌పూర్ శివారులోని రోళ్లవాగు వద్ద ఒక గుర్తు తెలియనివ్యక్తిని పెట్రోల్‌పోసి కాల్చి చంపారని అప్పటి కార్యదర్శి పుర్రె చిన్న నర్సయ్య బీర్‌పూర్ పోలీస్ సేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కార్యదర్శి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతుడి భార్య అంకం అరుణ, చిన్నకుమారుడు అంకం సాయికుమార్‌లకు లక్ష్మీనారాయణ మృతదేహం చూపించారు. వారు ఆ మృతదేహం తమ వారిది కాదని వదిలేసి వెళ్లారు. ఆ తరువాత మృతుడి యొక్క ఎముక భాగాలను డీఎన్‌ఏ పరీక్షల నిమిత్తం హైదరాబాద్‌కు పంపించారు. చనిపోయిన వ్యక్తి నర్సింహులపల్లికి చెందిన అంకం లక్ష్మీనారాయణగా గుర్తించి విషయాన్ని భార్య, కుమారుడికి తెలియజేయగా వారిలో ఎలాంటి స్పందన కనిపించలేదు. దీంతో మృతుడిభార్య అరుణ, కుమారుడు సాయికుమార్ మీద అనుమానం వచ్చి అదుపులోకి తీసుకొని విచారించగా మొదట్లో నేరాన్ని అంగీకరించలేదు. దీంతో ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానం పాలిగ్రాఫ్(లైడిటెక్టర్) టెస్ట్‌కు మృతుడి కుమారుడు, భార్యను పంపించామని డీఎస్పీతెలిపారు. దాంట్లో అంకం లక్ష్మీనారాయణను హత్యచేసింది వారేనని నిర్ధారించుకొని నిందితులను అదుపులోకి తీసుకుని బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ కేసును దర్యాప్తు చేసిన జగిత్యాల రూరల్ సీఐకృష్ణారెడ్డిని డీఎస్పీ అభినందించారు.

కాళేశ్వరం ప్రాజెక్టు కేసులో కోర్టుకు మంత్రి శ్రీధర్‌బాబు


నాంపల్లి కోర్టు విచారణకు హాజరైన మంత్రి శ్రీధర్‌బాబు

మంథని, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరంప్రాజెక్టులో భూములు, ఇళ్లు కోల్పోయిన వారికి న్యాయమైన పరిహారం అందించాలని డిమాండ్ చేసినందుకు అప్పటి బీఆర్‌ఎస్‌ప్రభుత్వం నమోదు చేసిన కేసులో మంత్రి శ్రీధర్‌బాబు బుధవారం నాంపల్లి కోర్టుకు హాజరయ్యారు. 2017లో బసంత్‌నగర్ పోలీసులు మంత్రి శ్రీధర్‌బాబుతోపాటు హర్కాల వేణుగోపాల్, అన్నయ్యగౌడ్, శశిభూషణ్‌కాచేతోపాటు మరో 9 మందిపై కేసులు నమోదుచేశారు. విచారణలో భాగంగా వారు కోర్టుకు హాజరయ్యారు. శాంతియుతంగా ఆందోళన చేసినా అప్పటి ప్రభుత్వం తమపై ఐపీసీ 147, 353, 427 రెడ్‌విత్‌149 సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు వారు వాపోయారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలో యూనివర్సిటీల భూములు కబ్జా



ఎస్‌యూలో బంద్ పాటించి నిరసన తెలుపుతున్న ఏబీవీపీ నాయకులు

గణేశ్‌నగర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత యూనివర్సిటీల భూములు కబ్జాకు గురవుతున్నాయని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మల్యాల రాకేష్ ఆరోపించారు. హెచ్‌సీయూ భూముల విషయంలో రాష్ట్ర ప్రభుత్వ వైఖరిపై బుధవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో శాతవాహన యూనివర్సిటీ బంద్ చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వ పాలనలో విద్యార్థులు, నిరుద్యోగులు ప్రజలు ప్రశాంతంగా జీవించలేకపోతున్నారన్నారు. విద్యార్థులకు ఉపయోగపడే బయోడైవర్సిటీ యూనివర్సిటీ 100 ఎకరాలను హైకోర్టుకు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నప్పుడు విద్యార్థులు నిరసన వ్యక్తం చేసినా పట్టించుకోలేదన్నారు. ప్రస్తుతం 400 ఎకరాల హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూమిని వెంచర్లు చేసి సొమ్ము చేసుకోవాలని చూస్తోందన్నారు. ఇక్కడ ఎన్నో రకాల పక్షులు, జంతువులు జీవిస్తున్నాయని, వాటి ప్రాణాలు తీసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. హెచ్‌సీయూలో భూముల కోసం విద్యార్థులు ధర్నా చేస్తుంటే లాఠీచార్జి సిగ్గుమాలిన చర్యన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమ్మాలని చూస్తున్న భూములను వెంటనే యూనివర్సిటీ కేటాయించాలని, విద్యార్థులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కేసులను ఎత్తివేయాలని, లేని పక్షంలో సెక్రెటేరియట్ ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యసమితి సభ్యులు కిరణ్మయి, జిల్లా కన్వీనర్ పూసాల విష్ణు, యూనివర్సిటీ అధ్యక్షులు బాలకృష్ణ, కార్యకర్తలు సాయి, అనూష, గౌరీ, ప్రియ, మానస తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేటలో కేంద్ర బృందం పర్యటన



కేంద్ర బృందాన్ని ఆహ్వానిస్తున్న అధికారులు

కోనరావుపేట ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండల కేంద్రంలో పాటు పలు గ్రామాల్లో జలశక్తి స్వచ్ఛభారత్ మిషన్ కేంద్ర బృందం అధికారులు బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఇంకుడు గుంతలు, కంపోస్ట్ షెడ్‌లను మర్తన్‌పేట ప్రభుత్వ పాఠశాలలో పారిశుధ్యం, తాగునీటి వంటి వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్ర బృందం డిప్యూటీ సెక్రెటరీ శ్రీనివాస్ సెక్షన్ ఆఫీసర్ నితిన్‌తో పాటు సెంట్రల్ టీం వర్మ జైపాల్ సురేష్‌బాబు తదితరులు ఉన్నారు.

పెన్షనర్లకు నష్టం చేసే బిల్లును ఉపసంహరించాలి

జగిత్యాల అర్బన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్లకు నష్టం చేసే బిల్లును కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించాలని టీ పెన్షనర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం జగిత్యాల జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన చర్చా వేదికలో ఆయన మాట్లాడుతూ పెన్షనర్లను పదవీ విరమణ తేదీ ఆధారంగా విడదీయడం అసమంజసమని ఇచ్చిన సుప్రీం కోర్టు తీర్పును గుర్తు చేశారు. ఈ సవరణ బిల్లు సుప్రీం తీర్పును నిర్వీర్యం చేసేలా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ తహసీల్దార్ పీసీ హన్మంత్, బొల్లం విజయ్, గౌరిశెట్టి విశ్వనాథం, వెల్మల ప్రకాశ్‌రావు, ఎండీ యాకుబ్, పూసల అశోక్‌రావు, డిండిగాల విఠల్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ రిబ్బన్‌కు ఓ ప్రత్యేకత



మీకు తెలుసా..

ఒక్కో సందర్భానికి ఒక్కో రంగు

గణేశ్‌నగర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఏవైనా నిరసనలు జరుగుతున్నప్పుడు అందులో పాల్గొన్న వారు నల్ల రంగు రిబ్బన్లు ధరిస్తారు. మహిళల ఆరోగ్యం గురించి అవగాహన కార్యక్రమం నిర్వహిస్తే గులాబీ రంగు రిబ్బన్లు ధరిస్తారు.. సందేహాలకు, సంతాపాలకు, నిరసనలకు, అవగాహనకు ఒక్కో సందర్భానికి ఒక్కో రిబ్బన్ వాడుతుంటారు. కొన్ని రకాల వ్యాధులు, వాటి పేరుకంటే కూడా రిబ్బన్ సింబల్ నే పాపులర్ అయ్యాయి. ఆ సింబల్ చూడగానే వ్యాధిపై అవగాహనకు వచ్చేస్తాం. రిబ్బన్లతో రకరకాల రంగులు నలుపు, తెలుపు, ఎరుపు, ఆకుపచ్చ, పసుపు ఇలా ఒక్కో రంగు ఒక్కో అంశాన్ని తెలియజేస్తుంది. ఈ నేపథ్యంలో ఏ రంగు రిబ్బను ఏం అంశాన్ని సూచిస్తుందో తెలుసుకుందాం.

18 రకాల రిబ్బన్లు

మానవ శరీరంలో వివిధ అవయవాలకు సోకిన క్యాన్సర్ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలకు వైద్యులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు 18 రకాల రిబ్బన్లను ఉపయోగిస్తారు. క్యాన్సర్ వ్యాధి సోకడానికి కారణాలు, వాటి లక్షణాలు, ట్రీట్మెంట్ విధానం ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై ప్రజలను చైతన్యం చేసేందుకు వీటిని ధరిస్తారు.



నల్ల రంగు..

తమ డిమాండ్లను తెలియజేస్తూ నిరసన వ్యక్తం చేసినప్పుడు నలుపు రంగు రిబ్బన్ ధరిస్తారు. మృతిచెందిన వారికి సంతాప సూచకంగా నివాళి అర్పించే సమయంలోనూ వీటిని ధరిస్తారు.

ఎరుపు రంగు

ఎయిడ్స్, బ్లడ్ క్యాన్సర్, గుండె జబ్బులు, వ్యసనాలు, విపత్తుల సందర్భంగా నిర్వహించే సమావేశాల్లో ఎరుపు రంగు రిబ్బన్‌ను ధరిస్తారు. అత్యవసర పరిస్థితులకూ దీనిని ఉపయోగిస్తారు.

నీలం రంగు

నీలం రంగు రిబ్బన్‌ను 100కు పైగా సందర్భాల్లో ఉపయోగిస్తారు. ప్రధానంగా మానవ అక్రమరవాణా, బెదిరింపులకు వ్యతిరేకంగా వీటిని ఉపయోగిస్తారు. జల సంరక్షణపై అవగాహన కల్పించే సమయంలోనూ నీలం రంగు రిబ్బన్‌ను వాడతారు.

తెల్ల రంగు

గర్భిణులు,మహిళలపై దాడులు జరిగినప్పుడు వాటికి వ్యతిరేకంగా నిర్వహించే నిరసన కార్యక్రమాల్లో తెల్ల రంగు రిబ్బన్ ధరిస్తారు. సురక్షిత మాతృత్వం, శాంతి, అహింసలను తెలుపుతూ జరిగే కార్యక్రమాల్లో వీటిని ఉపయోగిస్తారు.

ఆకుపచ్చ రంగు

మూత్రపిండాలు, కాలేయం, అవయవ దానం, సురక్షిత డ్రైవింగ్ పై అవగాహన కల్పించేందుకు ఆకు పచ్చ రంగు రిబ్బన్‌ను ఉపయోగిస్తారు. గ్లోబల్ వార్మింగ్‌పై సమావేశాల్లో ఈ రంగు రిబ్బన్‌ను వాడతారు.

పసుపు రంగు

యుద్ధ ఖైదీలు, తప్పిపోయిన వారి కోసం ఏర్పాటు చేసిన సమా వేశాల్లో పసుపురంగు రిబ్బన్ ను ధరిస్తారు. ఆత్మహత్యల నివారణకు, ఎముకల క్యాన్సర్ తదితర వాటి గురించి నిర్వహించే అవగాహన సదస్సులో వీటిని ఉపయోగిస్తారు.

గులాబీ రంగు

గులాబీ రంగు రిబ్బన్ మహిళల ఆరోగ్యానికి సంబంధించిన విషయాలను సూచిస్తుంది. ముఖ్యంగా ఆడవారిలో రొమ్ము క్యాన్సర్ పై అవగాహన కల్పించేందుకు దీనిని అంతర్జాతీయ గుర్తుగా ఉపయోగిస్తారు.

కొండగట్టులో హనుమాన్ చిన్న జయంతి ఏర్పాట్లు

మల్యాల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు అంజనేయస్వామి దేవస్థానంలో ఈ నెల 11 నుంచి 13 వరకు జరిగే హనుమాన్ చిన్న జయంతి కోసం ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. భక్తుల మాల విరమణ కోసం కల్యాణకట్ట వద్ద బారికేడ్లు, వాటి పై నుంచి భక్తులు కంపార్టుమెంట్లలోకి దూకకుండా పోలీసుల సూచనలతో ఈసారి కొత్తగా జాలీలు ఏర్పాటు చేస్తున్నారు. చలువ పందిళ్ల ఏర్పాటు పనులు కొనసాగుతుండగా దిగువ కొండగట్టు, దొంగలమర్రి



మాల విరమణ ప్రదేశంలో బారికేడ్లు కడుతున్న సిబ్బంది

వద్ద దేవస్థానం తరఫున స్వాగత తోరణాలు ఏర్పాటు చేశారు. బారికేడ్లు, ఇతర ఏర్పాట్లను ఆలయ ఈవో శ్రీకాంత్‌రావు, మల్యాల సీఐ నీలం రవి, అధికారులతో కలిసి పరిశీలించారు. కేవలం దర్శనాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం పోలీస్ అవుట్‌పోస్టు నుంచి కోనేరు వరకు ఈసారి ప్రత్యేక దారి ఏర్పాటు చేయనున్నారు.

రేపు ఎమ్మెల్యే సమీక్ష సమావేశం

హనుమాన్ చిన్న జయంతి ఏర్పాట్లపై శుక్రవారం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలు, ఇతర ఏర్పాట్లపై శాఖల వారీగా సమీక్షించి తగు సూచనలు చేయనున్నారు.

త్వరలో రిజర్వాయర్లలో పూడికతీత పనులు



కొత్తపల్లిలో మోయతుమ్మెద వాగు వద్ద స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఈ పెద్ది రమేష్, అధికారులు

తిమ్మాపూర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిర్ణయం ప్రకారం త్వరలో దిగువ మానేరు జలాశయం, మిడ్ మానేరు జలాశయం, కడెం ప్రాజెక్టులకు సంబంధించి పూడిక తీత పనులను ప్రారంభించనున్నట్లు ఇరిగేషన్‌శాఖ, సర్కిల్-2, ఎస్‌ఈ పెద్ది రమేష్ తెలిపారు. బుధవారం మండలంలోని కొత్తపల్లి గ్రామంలో గల మోయ తుమ్మెద వాగును, కొత్తపల్లి శివారులోని ఎస్‌ఆర్‌ఎస్పీ భూములను రెవెన్యూ, ఇతర ఇరిగేషన్ అధికారులు, ఏజెన్సీ నిర్వాహకులతో కలిసి ఎస్‌ఈ రమేష్ పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్ఎండీ, ఎంఎంఆర్, కడెం రిజర్వాయర్‌లలో పూడికతీతకు సంబంధించి అంగ్రిమెంట్ల ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. సుమారు 1453కోట్ల వ్యయంతో 20సంవత్సరాలకు సంబంధించి బాంబెకు చెందిన ఈథర్ ట్రినిటీ సహారా కన్సార్టియం కంపెనీ టెండర్లలో ఈ పనులను దక్కించుకుందని తెలిపారు. నెల వరకు పూడిక తీత పనులు ప్రారంభం ఆయ్యే అవకాశం ఉంది. పనులు ప్రారంభించే ముందు రిజర్వాయర్ నుంచి తీసిన ఇసుకను ఎక్కడ డంప్‌చేయాలి, కంపెనీ నిర్వాహకులకు సంబంధించి కార్యాలయం ఏర్పాటు, వేబ్రిడ్జ్ ఏర్పాటు, పనులు చేసే సిబ్బంది, లేబర్ ఉండేందుకు, మిషనరీల ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించామని తెలిపారు. ఎస్సారెస్పీ స్థలాన్ని కూడా గుర్తించామని తెలిపారు. రిజర్వాయర్‌లలో పూడికతీత వల్ల నీటి నిల్వ 3.9 టీఎంసీ సామర్థ్యం పెరుగుతుందన్నారు. అదే విధంగా పూడికతీత వల్ల వచ్చే ఇసుకను సంబంధిత కాంట్రాక్టర్ ప్రభుత్వానికి టన్నుకు 406.64 రూపాయలు చెల్లించి ఓపెన్ మార్కెట్‌లో అమ్ముకునే అవకాశం ఉంటుందని అన్నారు. దీంతో ప్రభుత్వానికి ఆదాయం చేకురుతుందన్నారు. గతంలో రిజర్వాయర్‌ల కోసం డబ్బులు చెల్లించి పనులు చేయించేవారు కానీ ప్రస్తుతం రెండు ప్రయోజనాలు వస్తుండటంతో ప్రభుత్వం ముందు ఈ మూడు రిజర్వాయర్‌లలో పూడిక తీతపై పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుందన్నారు. ఇది విజయవంతమైతే మిగతా ప్రాజెక్టులలో కూడా ఇలాంటి ప్రయోగం చేసే అవకాశాలు లేకపోలేదని ఎస్‌ఈ పెద్ది రమేష్ తెలిపారు. కార్యక్రమంలో తిమ్మాపూర్ తహసీల్దార్ విజయ్‌కుమార్, ఇరిగేషన్‌శాఖ ఈఈ నాగభూషణ్ రావు, ఏజెన్సీ పర్సన్ సతీష్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా స్వామివారి రథోత్సవం..



రథంపై స్వామివారి ఊరేగింపు

వేములవాడ కల్చరల్ ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో శ్రీరామనవమి వేడుకలను పురస్కరించుకుని రాములవారి రథోత్సవం వైభవంగా నిర్వహించారు ఉదయం అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఉత్సవమూర్తులను హంసవాహనంపై ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో శ్రావణ్ కుమార్ తదితరులున్నారు.

రాజన్న సేవలో కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ అధికారుల బృందం

వేములవాడ కల్చరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామివారిని కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ అధికారులు బుధవారం దర్శించుకున్నారు. గ్రామీణ స్వచ్ఛ భారత్ మిషన్ పరిశీలనలో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లాకు వచ్చిన బృందం సభ్యులు రాజన్నను దర్శించుకొని, కోడె మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు అధికారుల బృందానికి ఆశీర్వచనం ఇవ్వగా, సూపరింటెండెంట్ వరి నర్సయ్య, నరేందర్‌లు రాజన్న ప్రసాదాన్ని అందజేశారు.



కోడెమొక్కు, చెల్లించుకుంటున్న అధికారుల బృందం

జాతీయ సీనియర్స్ ఖో-ఖో జట్లకు కోచ్‌లుగా ఉమ్మడి జిల్లా వాసులు



పండుగ ఆనంద్ కుమార్



ఇస్లావత్ నరేష్

కరీంనగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఒడిస్సాలోని పూరీలో నిర్వహిస్తున్న 57వ సీనియర్స్ జాతీయ ఖో-ఖో పోటీలకు ఉమ్మడి జిల్లావాసులు కోచ్‌లుగా వ్యవహరిస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర పురుషుల జట్టుకు ఇల్లంతకుంటకు చెందిన రైల్వే క్రీడాకారుడు పూర్వ భారత జట్టు కెప్టెన్ పండుగ ఆనంద్, భారత పురుషుల రైల్వే జట్టుకు ధర్మారం మండలం బంజరుపల్లి తండాకు చెందిన దక్షిణ మధ్య రైల్వే క్రీడాకారుడు ఇస్లావత్ నరేష్ కోచ్‌గా వ్యవహరిస్తున్నట్లు ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఖో-ఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మహేందర్ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆనంద్, నరేష్‌ను రాష్ట్ర ఖోఖో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు జంగా రాఘవరెడ్డి, నాతి కృష్ణమూర్తి, జిల్లా ఖో-ఖో సంఘం ప్రధాన కార్యదర్శి మహేందర్‌రావు, సంఘం బాధ్యులు అభినందించారు.

ఎన్టీపీసీ నిర్మాణాలపై కార్పొరేషన్ కొరడా



- నోటీసులకు స్పందించని ఎన్టీపీసీ యాజమాన్యం
- రూ.99 కోట్ల అపరాధ రుసుం విధించిన కార్పొరేషన్

కోల్‌సిటీ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రామగుండం ఎన్టీపీసీ అక్రమ నిర్మాణాలపై రామగుండం నగరపాలక సంస్థ కొరడా ఝుళిపించింది. కార్పొరేషన్ అనుమతులు లేకుండా ఎన్టీపీసీ టౌన్‌షిప్‌లో నిర్మాణాలు జరిపి కార్పొరేషన్ నోటీసులు ఇచ్చినా స్పందించకపోవడంతో మున్సిపల్ చట్టం 2019 ప్రకారం చర్యలకు ఉపక్రమించింది. ఈ మేరకు రూ.99,28,29,548 అపరాధ రుసుం విధించినట్లు కార్పొరేషన్ కమిషనర్ అరుణశ్రీ పేర్కొన్నారు. ఎన్టీపీసీ టౌన్‌షిప్‌లో గత ఏడాది భారీ నిర్మాణాలు చేపట్టింది. మొత్తం 12రకాల నిర్మాణాలను చేపట్టారు. సీ టైపు, బీ టైపుల్లో అపార్ట్‌మెంట్ టవర్లు, సీఐఎస్ఎఫ్‌కు సంబంధించిన బిల్డింగ్‌లు, హెచ్‌ఓడీ బిల్డింగ్, డీ టైపు బిల్డింగ్‌లు, వీఐపీ గెస్ట్ హౌస్, బ్యాచ్‌లర్ హాస్టల్, ఏసీ రెస్టారెంట్, కమ్యూనిటీ సెంటర్ తదితర భవనాలను నిర్మించింది.

ఈ భవనాలకు కార్పొరేషన్ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోలేదు. దీంతో ఏప్రిల్ 22, 2024న 'ఆంధ్రజ్యోతి'లో 'రామగుండంలో అనుమతి లేకుండానే భారీ కట్టడాలు' శీర్షికన కథనం ప్రచురితమైంది. భవన నిర్మాణాలు పూర్తవుతున్నా అనుమతులు తీసుకోకపోవడంతో రామగుండం శాసనసభ్యులు రాజ్ ఠాకూర్, జిల్లా యంత్రాంగం సీరియస్‌గా స్పందించారు. ఎన్టీపీసీ యాజమాన్యం చట్ట ప్రకారం మెదలాలని, వెంటనే అనుమతులు తీసుకోవాలని సూచించారు. దీంతో మొత్తం 12 నిర్మాణాలకు సీ టైపు భవనాలు, సీఐఎస్ఎఫ్ భవనాలు తదితర నిర్మాణాలకు రూ.2.4కోట్లు ఫీజు చెల్లించింది. కొన్ని నిర్మాణాలకు మున్సిపల్ కార్పొరేషన్ అనుమతులు ఇచ్చింది. మిగతా నిర్మాణాలు రెసిడెన్షియల్ జోన్‌లో లేకపోవడంతో చేంజ్ ఆఫ్ ల్యాండ్ యూజ్(సీఎల్‌యూ) తీసుకోవాలంటూ నోటీసులు ఇచ్చింది. దీంతో ఎన్టీపీసీ యాజమాన్యం నిర్మాణ స్థలాలకు సంబంధించి సీఎల్‌యూకు ఫైల్ పెట్టింది. డీ టైపునకు సంబంధించి 8.33ఎకరాలు, హెచ్‌ఓడీ భవనాలకు సంబంధించి 7.98 ఎకరాలు, వీఐపీ గెస్ట్‌హౌస్ 2.07ఎకరాలు, బీ టైపు క్వార్టర్లు 3.21 ఎకరాలకు సీఎల్‌యూకు దరఖాస్తు చేసింది. గత ఏడాది సీఎల్‌యూకు దరఖాస్తు చేయగా డైరెక్టర్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ కార్యాలయం షార్ట్ ఫాల్ ఇచ్చింది. ఓనర్‌షిప్ సర్టిఫికెట్లు, టోన్స్ మ్యాప్‌లు సమర్పించాలని పేర్కొన్నది. మార్చి 19న రామగుండం నగర కమిషనర్ ఆరు నిర్మాణాలకు సంబంధించి అనుమతి లేని భవనాలకు నోటీసులు జారీ చేశారు. దీనిపై స్పందించక పోవడంతో పది రోజుల కాల వ్యవధిపై మార్చి 29న పెనాల్టీ నోటీసులు జారీ చేసినట్లు కమిషనర్ తెలిపారు.

ఆరు భవనాలకు పెనాల్టీ

రామగుండం నగరపాలక సంస్థ ఎన్టీపీసీకి చెందిన అనుమతి లేని ఆరు నిర్మాణంలో ఉన్న భవనాలకు రూ.99.28 కోట్ల పెనాల్టీ నోటీసులు జారీ చేసింది. మున్సిపల్ చట్టం 2019 ప్రకారం అనుమతి లేని కట్టడాలకు నోటీసులకు కూడా స్పందించకపోతే భవనాలకు సంబంధించి స్థలం, భవనాల విలువను పరిగణలోకి తీసుకుని అపరాధ రుసుము విధిస్తారు. బీ టైపు భవనాలకు రూ.39.61లక్షలు, హెచ్‌ఓడీ బిల్డింగ్‌కు రూ.18.55కోట్లు, టైపు డీ భవనాలకు రూ.27.29కోట్లు, గెస్ట్ హౌస్ బిల్డింగ్‌కు రూ.6.61కోట్లు, ఏసీ రెస్టారెంట్ బిల్డింగ్‌కు రూ.2.35కోట్లు, కమ్యూనిటీ సెంటర్ బిల్డింగ్‌కు రూ.4.83కోట్లు పెనాల్టీ జారీ చేసింది.





ఎన్టీపీసీలో నిర్మిస్తున్న భవనాలు

రేవంత్‌రెడ్డికి రైతన్న, నేతన్న రెండు కళ్లు..

అఖిల భారత పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కందికట్ల స్వామి

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక రైతన్న, నేతన్నను రెండు కండ్లుగా చూసుకుంటున్నారని అఖిల భారత పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కందికట్ల స్వామి అన్నారు. బుధవారం సిరిసిల్ల పట్టణం వస్త్ర వ్యాపార సంఘం భవనంలో విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడారు. దాదాపు రూ.25వేల కోట్లతో రైతన్నకు రుణమాఫీ, రైతు బంధును ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. నేతన్నల రుణమాఫీ రూ.33 కోట్లతో ఐదు వేల మందికి లక్ష రూపాయల రుణమాఫీ చేయాలని ముఖ్యమంత్రిని కోరగా, వెంటనే రుణమాఫీ చేశారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా రూ.380 కోట్లు బతుకమ్మ చీరల బకాయిలను కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ద్వారా బకాయిలను విడుదల చేశారన్నారు. సిరిసిల్లలో వస్త్ర పరిశ్రమకు విద్యుత్ సంక్షోభాన్ని తీసుకొచ్చి ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలని చూస్తున్నారని ఆరోపించారు. సెస్‌లో గత ప్రభుత్వానికి చెందిన పాలకవర్గం ఉండడం వల్ల ఒత్తిడి తెస్తున్నారన్నారు. బతకమ్మ చీరల స్థానంలో ప్రభుత్వం రూ.680కోట్ల ఆర్డర్లతో కోటి 30 లక్షల చీరలను ఎనిమిది కోట్ల మీటర్ల ఆర్డర్లను తీసుకొచ్చిందన్నారు.

ఈ ఆర్డర్లు సకాలంలో జరగాలంటే విద్యుత్ సదుపాయం ఉండాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఆర్డర్ల పనులు జరగకుండా సెస్ పాలకవర్గం ఇబ్బందులకు గురి చేస్తుందని ఆరోపించారు. విద్యుత్ బకాయిల పేరుతో మీటర్ వైర్లను కట్ చేసి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని సెస్ పాలకవర్గం చూస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులకు భరోసా ఇవ్వడానికే తాము వచ్చామన్నారు. ఈ సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి గడ్డం జగన్నాథం, మురళి, వస్త్ర వ్యాపార సంఘం తాటిపాముల దామోదర్, ఉపాధ్యక్షుడు ఏనుగుల ఎల్లయ్య, ప్రధాన కార్యదర్శి గౌడరాజు, పాలిస్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆడెపు భాస్కర్, కార్యదర్శ ఆంకారపు రవి, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కందికట్ల స్వామి

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత

● ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం


మానకొండూర్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

మానకొండూర్/ జమ్మికుంట/ హుజూరాబాద్ రూరల్/ చొప్పదండి: రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని, ప్రజలను జాగృతం చేయడానికే పాదయాత్ర అని ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ అన్నారు. మానకొండూర్, చొప్పదండి, జమ్మికుంట, హుజూరాబాద్‌లలో బుధవారం జై బాపు, జై భీం, జై సంవిధాన్ పాదయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బలహీన వర్గాలకు అన్ని రకాల హక్కులు కల్పించిన రాజ్యాంగాన్ని బీజేపీ నాయకులు అవమానపరుస్తున్నారని మండిపడ్డారు. పార్లమెంట్ సాక్షిగా బీజేపీ నాయకులు అంబేద్కర్‌ను అవమానపరిచారని, దీనికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

జూబ్లీనగర్‌లో..

కరీంనగర్ రూరల్: కరీంనగర్ మండలం జూబ్లీనగర్‌లో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, కరీంనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పురమల్ల శ్రీనివాస్ రాజ్యంగ పరిరక్షణ యాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన జైబాపు, జైభీమ్, జైసంవిధాన్‌లో భాగంగా యాత్ర చేపట్టినట్లు చెప్పారు. అంతకుముందు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి, అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత వుట్కూరి నరేందర్ రెడ్డి, పర్వతం మల్లేశం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాయిని తిరుపతి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాంరెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు సుదర్శన్, పెంచాల లక్ష్మణ్ రావు తదితరులు పాల్గొన్నారు.

● జై బాపు, జైభీమ్, జై సంవిధాన్ అభియాన్‌లో భాగంగా గురువారం కరీంనగర్ మండలం నగునూర్ ఫకీర్‌పేట గ్రామాల్లో రాజ్యంగ పరిరక్షణ యాత్ర నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ కరీంనగర్ నియోజక వర్గ ఇన్‌చార్జి పురమల్ల శ్రీనివాస్ తెలిపారు.


జూబ్లీనగర్‌లో హాజరైన సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, అల్ఫోర్స్ అధినేత నరేందర్ రెడ్డి, నియోజక వర్గ ఇన్‌చార్జి పురమల్ల శ్రీనివాస్


ఆర్నకొండలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

భగత్‌నగర్: కొత్తపల్లి మండలంలోని కమాన్‌పూర్‌లో కాంగ్రెస్ శ్రేణులు పాదయాత్ర చేపట్టాయి. కరీంనగర్ అసెంబ్లీ నియోజక వర్గ ఇన్‌చార్జి పురమల్ల శ్రీనివాస్, జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ యాత్ర ఇన్‌చార్జి నమిండ్ల శ్రీనివాస్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, కొత్తపల్లి మండల కో-ఆర్డినేటర్ కర్ర సత్యప్రసన్నారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాయిని తిరుపతి, పార్టీ మండల అధ్యక్షుడు స్వామిగౌడ్ పాల్గొన్నారు.

చిగురుమామిడి: మండలంలోని బొమ్మనపల్లిలో హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్‌కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి జైబాపు జైభీమ్ జైసంవిధాన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

సైదాపూర్: మండల కేంద్రంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు, మార్కెట్ కమిటీచైర్మన్‌దొంత సుధాకర్ ఆధ్వర్యంలో పాదయాత్ర చేపట్టారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గణేశ్‌నగర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పట్టణ, రూరల్ ప్రాంతాల్లో మరమ్మతుల్లో భాగంగా గురువారం విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు టౌన్ టు, రూరల్, ఏడీఈలు లావణ్య, రఘు ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 11 వరకు వల్లంపహాడ్, మధ్యాహ్నం 2 గంటల నుంచి 3 వరకు విద్యానగర్, బీరప్ప కమాన్ ఏరియా, కొత్త యాస్వాడ, పారిశ్రామిక ప్రాంతం, వెంకటేశ్వర కమాన్ ఏరియాలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

అల్ఫోర్స్ మహిళా డిగ్రీ కళాశాలలో సిగ్నేచర్ డే


విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేస్తున్న కరస్పాండెంట్ రవీందర్‌రెడ్డి

భగత్‌నగర్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): నగరంలోని అల్ఫోర్స్ మహిళా డిగ్రీ కళాశాల సిగ్నేచర్ డే వేడుకలను బుధవారం ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ రవీందర్ రెడ్డి కేక్‌కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలో నిర్మించుకున్న చక్కని వ్యక్తిత్వం ముందుతరాలకు ఆదర్శమవ్వాలని, ఇతరులకు ఆటోగ్రాఫ్ ఇచ్చేలా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అన్నారు.

గుర్తు తెలియని వ్యక్తులు పంపే లింకులు ఓపెన్ చేయొద్దు

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వ్యక్తుల పేరిట సైబర్ మోసగాళ్లు పంపే లింకులు ఓపెన్ చేయొద్దని, మెస్సేజ్‌లకు స్పందించవద్దని కరీంనగర్ టూ టౌన్ సీఐ సృజన్‌రెడ్డి అన్నారు. గోదాంగడ్డ ప్రాంతంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఆన్‌లైన్‌లో పెట్టుబడుల పేరిట జరుగుతున్న మోసాలు, ఐపీఎల్ బెట్టింగ్, మహిళలు, చిన్న పిల్లలపై జరుగుతున్న నేరాలపై అవగాహన కల్పించారు.

సీసీ స్టోర్ నామినేటెడ్ కమిటీని తొలగిస్తూ ఉత్తర్వులు

భగత్‌నగర్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లిలోని వినియోగదారుల సహకార సంఘం నామినేటెడ్ కమిటీని తొలగిస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. వినియోగదారుల సహకార సంఘం కమిటీ పదవీ కాలం గత జనవరిలో ముగిసింది. చట్ట ప్రకారం ఎన్నికైన కమిటీకి 6 నెలల పొడిగింపు ఇవ్వాలి. లేదా పర్సన్ ఇన్‌చార్జి కమిటీగా నియమించాలి. అలా చేయకుండా తొమ్మిది మందిని జిల్లా సహకార అధికారి పర్సన్ ఇన్‌చార్జి కమిటీగా నామినేట్ చేశారు. దీనిని సవాల్ చేస్తూ ఎండీ ఫకృద్దీన్ రిట్ పిటిషన్ దాఖలు చేశారు. సవాల్‌ను స్వీకరించిన హైకోర్టు డీసీవో ఇచ్చిన ఉత్తర్వులను నిలిపి వేసి, పర్సన్ ఇన్‌చార్జిని నియమించాలని జిల్లా సహకార అధికారిని ఆదేశించింది.

వైద్యుడి ఆర్థిక సహాయం

సుభాష్‌నగర్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన డాక్టర్ బీఎస్ రావు బుధవారం పేషంట్ కుటుంబానికి రూ.20వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. గతనెల 2న ప్రమాదానికి గురైన చట్ల సమ్మయ్య అనే వ్యక్తి కోమాలో ఉండగా కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లో ఆపరేషన్ చేయించారు. ప్రస్తుతం ఓ రిహాబిటేషన్ సెంటర్‌లో వైద్యం చేయిస్తున్నారు. చికిత్స కోసం ఇప్పటి వరకు సుమారు రూ.10లక్షల వరకు ఖర్చు చేశారు. పేద కుటుంబానికి చెందిన సమ్మయ్య పరిస్థితి తెలుసుకున్న డాక్టర్ బీఎస్‌రావు ఫౌండేషన్ ద్వారా చెక్కు అందజేశారు.

● న్యూస్‌బాక్స్

ఉచిత వైద్య శిబిరం

సుభాష్‌నగర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో బుధవారం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మెయిన్ బ్రాంచ్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ రాంపాల్ వైద్య పరీక్షలు చేశారు. సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సన్నబియ్యం పంపిణీ

భగత్‌నగర్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): నగరంలోని అశోక్‌నగర్ రేషన్ షాపులో స్థానిక బీజేపీ నాయకుడు జీవీ రమణ బుధవారం సన్నబియ్యం పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సన్న బియ్యం కోసం కేంద్ర ప్రభుత్వం కిలోకు రూ.40 చొప్పున ఖర్చు చేస్తోందన్నారు.

నేడు భారతీ తీర్థ మహాస్వామి వర్ధంతి

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): నగునూర్ దుర్గా భవానీ ఆలయంలో గురువారం ఉదయం 9 గంటలకు దక్షిణా మ్నాయ శృంగేరి శారదా పీఠాధీశ్వరుడు, జగద్గురు భారతీ తీర్థ మహాస్వామి 77వ వర్ష వర్ధంతి నిర్వహించనున్నట్లు ఆలయ ఫౌండర్ చైర్మన్ వంగల లక్ష్మణ్ బుధవారం ప్రకటనలో తెలిపారు. ఆలయ ధర్మాధికారి పురాణం మహేశ్వర శర్మ ఆధ్వర్యంలో కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

మునగ రైతులకు చెక్కుల అందజేత

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చామనపల్లిలో ఉపాధి హామీలో మునగ ప్లాంటేషన్ చేసుకున్న రైతులకు నిర్వహణ వ్యయం గ్రామ పంచాయతీలో జమయ్యాయి. ఎంపీడీవో సంజీవరావు బుధవారం రైతులకు చెక్కులను అందజేశారు. ఎంపీవో జగన్ మోహన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

అంబేద్కర్ స్టేడియం అభివృద్ధి నిధులకు గ్రీన్‌సిగ్నల్

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం రూ.25 కోట్ల నిధుల మంజూరుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని మాజీ మేయర్, బీజేపీ నేత యాదగిరి సునీల్‌రావు తెలిపారు. బుధవారం ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నగరంలో యువతకు క్రీడలపై ఆసక్తి ఉన్నా సరైన సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయమై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మంగళవారం ఢిల్లీలో కేంద్ర యువజన క్రీడల శాఖ మంత్రి మన్‌సుక్ మాండవీయను నిధులు కేటాయించాలని కోరారని, వెంటనే స్పందిస్తూ రూ.25 కోట్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. నగర మంచినీటి సరఫరా విషయంలో మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తప్పుడు సమాచారంతో ప్రజలను తప్పుదోవపట్టిస్తున్నారని విమర్శించారు. మాజీ కార్పొరేటర్లు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను విస్తృతంగా ప్రచారం చేయాలి

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను కార్యకర్తలు, నాయకులు విస్తృతంగా ప్రచారం చేయాలని యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జిల్లా ఇన్‌చార్జి అబ్దుల్ అమీర్ అన్నారు. డీసీసీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన యువజన కాంగ్రెస్ సమీక్షా సమావేశంలో మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. జిల్లా అధ్యక్షుడు ముత్యం శంకర్, నాయకులు గుర్రం వాసు, ఫాహద్, కృపాసాగర్, రాహుల్, అనిల్, శ్రీకాంత్, విష్ణు, నాగరాజు పాల్గొన్నారు.



సమావేశంలో యువజన కాంగ్రెస్ నాయకులు

కాంగ్రెస్‌లో ఫ్లెక్సీల గొడవ

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌లో కొన్ని రోజులుగా ఫ్లెక్సీల గొడవ నడుస్తున్నది. గతంలో ఒక పార్టీ ఫ్లెక్సీలపై మరో పార్టీ మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేయడం, తొలగించడం వంటి సంఘటనలు చోటు చేసుకునేవి. ఒకే పార్టీలో రెండు గ్రూపులుగా ఏర్పడి ఫ్లెక్సీలను తొలగించడం, ఫిర్యాదు చేసుకోవడం గమనార్హం. రంజాన్ పండుగ రోజు ఓ యువజన కాంగ్రెస్ నాయకుడు నగరంలో భారీగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేశాడు. దీంతో ఓ ప్రైవేట్ వ్యక్తి చెబితే మున్సిపల్ సిబ్బంది ఫ్లెక్సీలను తొలగించారని ఆ నాయకుడు డిప్యూటీ మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశాడు. తాజాగా మంగళవారం రాత్రి అదే యువజన కాంగ్రెస్ నాయకుడి ఫ్లెక్సీని డీసీసీ కార్యాలయం ఎదుట గుర్తుతెలియని వ్యక్తులు దహనం చేశారు. మరో నాయకుడు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను చించివేశారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా చోటుచేసుకుంటున్న సంఘటనలపై కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

సమాజ సేవలో విద్యుత్ ఉద్యోగులు

గణేశ్‌నగర్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి):విద్యుత్ ఉద్యోగులు విధి నిర్వహణతోపాటు సమాజ సేవలోనూ ముందుంటున్నారని కరీంనగర్ సర్కిల్ సూపెరింటెండింగ్ ఇంజనీర్ రమేష్‌బాబు తెలిపారు. ఉద్యోగులు నిర్వహిస్తున్న వీబీ ఫౌండేషాన్, హౌసింగ్ బోర్డు కాలనీ, కరీంనగర్. స్వచ్ఛంద సంస్థకు ప్రతీ నెల రూ.20 వేలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి ప్రోత్సాహంతో ప్రతీ ఉద్యోగి స్వచ్ఛందంగా ముందుకొచ్చి వీలైనంత సహాయం అందిస్తున్నట్లు తెలిపారు.

ఫాం పాండ్ పనులు ప్రారంభం

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం చామనపల్లి గ్రామంలోని మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా గ్రామంలోని అప్పన్న చెరువు వద్ద ఫాంపాండ్ పనులను బుధవారం ప్రారంభించారు. ఈ పనులను ఎంపీవో జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఉపాధిహామీ పనులను పరిశీలించారు. కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పని స్థలాల్లో ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఆయన వెంట ఏపీవో శోభారాణి, పంచాయతీ కార్యదర్శి కె.మహేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వలస కార్మికుల పిల్లలకు ఇంగ్లీష్‌లో బోధించాలి

కరీంనగర్ రూరల్, ఏప్రిల్2 (ఆంధ్రజ్యోతి): వలస కార్మికుల పిల్లలకు ఇంగ్లీష్‌లో బోధించాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. కరీంనగర్ మండలం మొగ్దుంపూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక తరగతిలో చదువుతున్న సుమారు వంద మంది వలస కార్మికుల పిల్లలకు స్కూల్ బ్యాగులు, డ్రాయింగ్ బుక్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో వలస కార్మికుల పిల్లల చదువును ప్రోత్సహిస్తున్నామన్నారు. ఇందుకోసం ఎంపిక చేసిన పాఠశాలల్లో ప్రత్యేక తరగతుల్లో 500 మందికి పైగా కార్మికుకుల పిల్లలకు బోధిస్తున్నట్లు చెప్పారు. మొగ్దుంపూర్, బొమ్మకల్, చెర్లబూత్కూర్ ప్రభుత్వ పాఠశాలల్లో వలస కార్మికుల పిల్లలకు బోధన కొనసాగుతున్నట్లు తెలిపారు. అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, క్వాలిటీ కో ఆర్డినేటర్ అశోక్ రెడ్డి, సెక్టోరియల్ అధికారి ఎంఈవో రవీందర్, ప్రధానోపాధ్యాయులు పద్మ భాగ్య లక్ష్మీ, ఎంఈవో రవీందర్ పాల్గొన్నారు.


బ్యాగులు పంపిణీ చేస్తున్న చేస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

పేదల గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోయేది సన్నబియ్యం పథకం

రామడుగు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేపట్టిన సన్నబియ్యం పథకం పేదల గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోతుందని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్నబియ్యం పంపిణీ పథకాన్ని రామడుగు మండలం వెదిర గ్రామంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ పథకం నిరుపేదలకు ఒక వరమని అన్నారు. కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ పేదలకు సమృద్ధిగా సన్నబియ్యం రేషన్‌షాపుల ద్వారా సరఫరా చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బొమ్మరవేణి తిరుమల, వైస్‌చైర్మన్ సత్యంరెడ్డి, ప్యాక్స్‌చైర్మన్‌ఒంటెల మురళీకృష్ణ రెడ్డి, తహసీల్దార్ వెంకటలక్ష్మి, గ్రామస్థులు పాల్గొన్నారు.

గంగాధర: ప్రభుత్వంపేదలకు అందిస్తున్న సన్నబియ్యం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని అడిషనల్ కలెక్టర్ లక్ష్మీకిరణ్ అన్నారు. బుధవారం మండలంలోని మంగపేటలో సన్నబియ్యం పంపిణీ పథకాన్ని ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ జాగిరపు రజిత, డీఎస్‌వో నర్సింగరావు,ఆర్డీవో మహేశ్వర్, సివిల్ సపయ్ డీటీ ఉషా, తహసీల్దార్ అనుపమరావు, తదితరులు పాల్గొన్నారు.


వెదిరలో సన్నబియ్యం పంపిణీ చేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

పేదప్రజల సంక్షేమమే ధ్యేయం..

మానకొండూర్/తిమ్మాపూర్/జమ్మికుంట/వీణవంక: మానకొండూర్, తిమ్మాపూర్‌లలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, జమ్మికుంటలో వొడితెల ప్రణవ్ బాబు సన్నబియ్యం పథకాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదప్రజల సంక్షేమమే రాష్ట్రప్రభుత్వ ధ్యేయమని అన్నారు. వీణవంక మండలంలోని వల్భాపూర్, నర్సింగాపూర్ గ్రామాల్లో ఉచితసన్నబియ్యం పంపిణీపథకాన్ని బుధ వారం కాంగ్రెస్‌పార్టీ మండలాధ్యక్షుడు ఎక్కటి రఘుపాల్‌రెడ్డి ప్రారంభించారు.

ప్రమాదకరంగా బైక్ ప్రయాణాలు

● హెల్మెట్ ధరించని వాహనదారులు ● రోజు రోజుకు పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు
● హెల్మెట్ తప్పనిసరిపై పోలీస్‌ల చర్యలు



జమ్మికుంట రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంతో పాటు మండలంలోని గ్రామాల్లో నిత్యం ఏదో ఒకరూపంలో బైక్‌ప్రమాదాలు జరుగుతున్నాయి. ఒక్కోసారి ఇవి మరణాలకు కారణం అవుతున్నాయి. ఎదురుగా వచ్చే వాహనాన్ని ఢీకొట్టి ముందు వెళ్తున్న వాహనం సడన్ బ్రేక్ వేయడం, మద్యం మత్తులో ఎదుటి వారి నిర్లక్ష్యంతో తరు చూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డుప్రమాదాల బారినపడ్డ ద్విచక్రవాహనదారుల్లో ఎక్కువమంది తలకు గాయాలై మృత్యు వాత పడుతున్నారు. వారు హెల్మెట్ ధరిస్తే విలువైన జీవితాన్ని రక్షించుకోవచ్చు. జమ్మికుంట మండలంలోని ప్రధానరహదారుల్లో తరుచూ రోడ్డుప్రమాదాలు జరిగి ద్విచక్రవాహన దారులు ప్రాణాలు కోల్పోయిన సందర్భాలు ఎన్నోఉన్నాయి. హుజూరాబాద్, ధర్మారం, ఇల్లందకుంట ప్రధానరహదారుల్లో గడిచిన ఏడాదిలో పలు ప్రమాదాలు జరిగాయి. హెల్మెట్‌తో తలకు మాత్రమే రక్షణ కాదు. వేసవిలో విపరీ తంగా వీచే వడగాలుల నుంచి రక్షించుకోవచ్చు. మార్చి చివరి వారంలోనే భానుడు ప్రచండరూపం దాల్చుతుండటంతో వేసవిలో బయటకు వచ్చే వాహనదారులు హెల్మెట్ పెట్టు కుంటే ఎండతో పాటు వడగాలుల నుంచి రక్షణ పొందవచ్చు.


● హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి..
- పట్టణ సీఐ వరంగంటి రవికుమార్

ద్విచక్రవాహనాలు నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి. అనుకోని సందర్భాల్లో ప్రమాదాల బారినపడి ఇది ప్రాణాలను రక్షిస్తుంది. హెల్మెట్‌లేకుండా వాహనాలు నడిపేవారికి జరిమానా విధిస్తాం. హెల్మెట్ ధారణ సామాజిక బాధ్యతగా గుర్తించాలి.

అవీ.. ఇవీ..

ఇల్లందకుంట: మండలకేంద్రంలోని పీహెచ్‌సీలో ఫార్మసిస్ట్ గ్రేడ్-2గా విధులు నిర్వహిస్తున్న దాసరి సరళ పదవీవిరమణ పొందగా సిబ్బంది ఘనంగా సన్మానించారు.

హుజూరాబాద్: హుజూరాబాద్‌లో శ్రీరామనవమి ఉత్సవాలకు నిధులు మంజూరు చేయాలని నాయకులు మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు.

- పట్టణంలోని అంబేద్కర్‌చౌరస్తా వద్ద హెచ్‌సీయూ భూములను కాపాడాలని సీపీఎం నాయకులు నిరసన చేపట్టారు.

- హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడిగా నరెడ్ల వినోద్‌రెడ్డిని నియమిస్తూ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ప్రణవ్ ఉత్తర్వులు జారీ చేశారు.

శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు మత్స్యగిరీంద్రస్వామి ఆలయంలో బుధవారం మత్స్యజయంతి నిర్వహించారు.

వీణవంక: మండలంలోని వీణవంక ప్రత్యేకాధికారిగా సల్మాన్‌రాజు బుధవారం బాధ్యతలు చేపట్టారు.

హుజూరాబాద్ రూరల్: మండలంలోని రాంపూర్‌కు చెందిన చేరాల సాయిలు కరీంనగర్ కమర్షియల్ టాక్స్ ఆఫీసులో అసిస్టెంట్ మేనేజర్ పదవీవిరమణ సందర్భంగా బుధవారం జిల్లా కేంద్రంలో సన్మానించారు. వరంగల్ కమర్షియల్ టాక్స్ నోడల్ అధికారి శశిధర్‌చారి పాల్గొన్నారు.

-మండలంలోని సింగాపూర్‌లో బాలవికాస సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాటర్‌ప్లాంట్ ఏపీసీటీఈ సహకారంతో ఏర్పాటు చేసిన సౌరవిద్యుత్‌తో నడిచేలా కిట్స్ కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఇంద్రనీల్ ప్రారంభించారు.

జమ్మికుంట: గౌడసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా గండి రంజిత్‌కుమార్‌గౌడ్ ఎన్నికైన సందర్భంగా వొడితెల ప్రణవ్‌బాబు గురువారం ఘనంగా సన్మానించారు.

రామడుగు: కరీంనగర్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో వెలిచాల సరస్వతి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు సత్తాచాటారనిహెచ్‌ఎం శ్రీనివాస్ తెలిపారు.

-మండలంలోని గోపాల్‌రావుపేటలో లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి.

కరీంనగర్ కల్చరల్: కరీంనగర్, నల్గొండ, వరంగల్ జిల్లాల పరిధిలోని చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా అధ్యక్షమండలి బిషప్ డాక్టర్ రూబెన్‌మార్క్‌కు మాతృ వియోగం పొందారు. ఆయన తల్లి జెస్సి కళావతి (91) మంగళవారం వృద్ధాప్య కారణంగా మరణించారు.

ఆలయాల అభివృద్ధికి సహకరించాలి

గంగాధర, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఆలయాల అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, తాజామాజీ సర్పంచ్ కంకణాల విజేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని గట్టుబూత్కూర్ సీతారామ చంద్రస్వామి ఆలయంలో 70వేలు స్వంత నిధులతో గ్రామానికి చెందిన దాతలు కంకణాల సత్యనారాయణరెడ్డి, బొమ్మడిగోపాల్‌రెడ్డి సీసీరోడ్డు నిర్మాణానికి ముందుకు వచ్చారు. ఈసందర్భంగా విజేందర్‌రెడ్డి బుధవారం సీసీ రోడ్డును నిర్మించారు. అనంతరం మాట్లాడుతూ గతంలో గ్రామ పెద్దల కోరిక మేరకు దాతలు సహకరించి ఆలయంలో సీసీ రోడ్డుకు నిధులు వెచ్చించడం అభినందనీయమన్నారు. గ్రామస్థుల కోరిక మేరకు సీసీ రోడ్డు నిర్మించినదాతలకు తాజామాజీసర్పంచ్ విజేందర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.


దాతల సహకారంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కార్యాచరణ

● రాష్ట్ర జేఏసీ చైర్మన్, టీఎన్జీవోల రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్

తిమ్మాపూర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఈనెల ఒకటవతేది నుంచి ఒక కార్యచరణ ప్రకటించామని రాష్ట్ర జేఏసీ చైర్మన్, టీఎన్జీవోల రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ పేర్కొన్నారు. మండలంలోని ఎల్ఎండీ కాలనీలోగల నీటిపారుదలశాఖ, కార్యనిర్వహక ఇంజనీయర్, కార్యాలయం-1లో సీనియర్ అసిస్టెంటుగా విధులు నిర్వహిస్తూ, టీఎన్జీవో సంఘంలో జిల్లా ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్న గూడరాఘవరెడ్డి పదవీవిరమణ పొందాడు. ఈ కార్యక్రమానికి మారం జగదీశ్వర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఏ రాజకీయపార్టీ అయినా వారిరాజకీయ ప్రయోజనాల కోసమే తమను వాడుకుంటున్నారని చిత్తశుద్ధితో ఉద్యోగులకు న్యాయం చేయాలని మారం జగదీశ్వర్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లాటీఎన్జీవోల సంఘ అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శిసంఘం లక్ష్మణ్‌రావు,ప్రదీప్,కిషన్,సరిత,ఉద్యోగులు పాల్గొన్నారు.

రూ. 7380 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, ఏప్రిల్ 02 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7380 పలికింది. గురువారం మార్కెట్ యార్డుకు తొమ్మిదిమంది రైతులు 109క్వింటాళ్లు విడిపత్తి, ముగ్గురు రైతులు 13క్వింటాళ్లు గోనెసంచుల్లో విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలంపాట ద్వార గరిష్ఠ ధర రూ.7380, కనిష్ఠ ధర రూ.5300 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

సర్వాయి పాపన్న వర్ధంతి


సైదాపూర్: సర్వాయిపేట కొమ్ముగుట్ట వద్ద పాపన్న విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పిస్తున్న గౌడ సంఘం నాయకులు

హుజూరాబాద్/సైదాపూర్/జమ్మికుంటరూరల్/చొప్పదండి/గన్నేరువరం/చిగురుమామిడి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండలంలోని సర్వాయిపేట గ్రామశివారులోని కొమ్ముగుట్ట వద్ద, మండలాల్లో, సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతిని బుధవారం గౌడసంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలనుకొనియాడారు. జమ్మికుంటపట్టణంలోని హుజూరాబాద్‌రోడ్డులో గౌడసంఘం ఆధ్వర్యంలో వొడితెల ప్రణవ్‌బాబు, దేశినికోటి సర్వాయిపాపన్న విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

రాజ్యాంగ నినాదాలు పలికే అర్హత కాంగ్రెస్‌కు లేదు

చిగురుమామిడి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌ప్రభుత్వం జై బాపు, జై భీమ్, జై రాజ్యాంగం నినాదాలతో వస్తున్న పాదయాత్రను ప్రజలు బహిష్కరించాలని ధర్మ సమాజ పార్టీ (డీఎస్పీ) జిల్లాఅధ్యక్షుడు తాళ్లనరేష్ అన్నారు. చిగురుమామిడిలో ఒక ప్రకటనలో పేర్కొంటూ జై భీమ్, జై భారత రాజ్యాంగం అనే నినాదాన్ని పలికే నైతిక అర్హత కాంగ్రెస్ పార్టీకి లేదన్నారు. అంబేద్కర్ పోరాటానికి అడుగడుగునా అడ్డుపడ్డ కాంగ్రెస్ పార్టీకి జై భీమ్ అనే నినాదాన్ని పలికే అర్హత లేదన్నారు.